క్లుప్తంగా

ఆకాశంలో కారు మేఘాలు.. రైతుల్లో గుబులు

కొయ్యూరు: వరి రైతులు కారుమేఘాలను చూసి కలవరపడుతున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు కురిస్తే తడిసిన ధాన్యంతో తీరని నష్టాలు వస్తాయని గిరిజన రైతులు భయపడుతున్నారు. రెండు రోజుల నుంచి మండలంలోని వాతావరణం మబ్బులతో నిండి ఉంది. మండలంలోని ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరి కోతలు జరిగాయి. పొలాల్లో వరి కుప్పలను ఉంచారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్షం కురిస్తే పంటకు ఎక్కువ నష్టం జరుగుతుందని ఆందోళన పడుతున్నారు. కొన్నిచోట్ల పండిన పంటను కోసేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు.

రహదారి నిర్మించాలని డిమాండ్



రోడ్డు కోసం డిమాండ్ చేస్తున్న గ్రామస్తులతో గిరిజన సంఘం నాయకులు

అరకులోయటౌన్: మండలంలోని బొండాం పంచాయతీ కొత్తవలస రహదారి నిర్మించాలని డిమాండ్ చేస్తు ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఆయన సంఘం నాయకులతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని రహదారిని స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ రహదారి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కిలోమీటరు రహదారిని ఐదేళ్లు అయినా పూర్తి చేయలేదన్నారు. రహదారి నిర్మించాలని పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని చెప్పారు. రహదారి పూర్తి చేయకపోవడంతో సుదూర ప్రాంతం ప్రయాణించి, వేరే మార్గం ద్వారా గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని కోరారు.

సస్యరక్షణతో పంటలకు మేలు

చింతూరు: మండలంలో వరి కోత దశలో ఉన్నందున రెల్లరాల్చు పురుగు ఆశిస్తోందని దీని నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పురుగు ప్రధానంగా వరి కంకుల అడుగు భాగాన్ని కొరికి పాడు చేస్తుందని దీంతో గింజలు రాలిపోయి నష్టం వాటిల్లే అవకాశముందని ఆయన తెలిపారు. దీని నివారణకు వేపనూనె, క్లోరీఫైరిఫాస్ 20 ఈసీ లేదా 50 ఈసీ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పైరు బాగా తడిసే విధంగా పిచికారీ చేయాలని ఆయన సూచించారు. సాయంత్రం వేళల్లో పిచికారీ చేయడం వలన పురుగులు త్వరగా నశించే అవకాశముందని రైతులు ఈ సూచనను పాటించాలని ఆయన కోరారు.

రహదారి పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ బిమలమ్మ తదితరులు

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని భీంపోలు నుంచి సరియా వరకు రహదారి నిర్మాణ పనులకు సర్పంచ్ బిమలమ్మ ఆదివారం శంకుస్థాపన చేసారు. ఆమె మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కూటమి నాయకులు సింహాచలం, సింహాద్రి, కన్నయ్య, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు రేపు

వై.రామవరం: కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని గురమంద విశ్వనాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.
తాడేపల్లి గూడెంకు చెందిన పంచాంగకర్త రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి వినాయకపూజ, రుద్రాభిషేకం, రుద్రహోమం, శివపార్వతుల కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన జరుగుతుందని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు.

యాంత్రీకరణతో సేద్యానికి ఊతం



నూర్పిడి ధాన్యాన్ని ట్రాక్టర్‌కు ఫ్యాన్ బిగించి గాలి పడుతున్న దృశ్యం

- వరి కోత, నూర్పిడి పనులకు అందుబాటులోకి ఆధునిక పరికరాలు
- కూలీల కొరత నివారణతో పాటు తగ్గుతున్న పెట్టుబడి ఖర్చు
- యంత్రాల వినియోగంపై గిరిరైతుల ఆసక్తి



చొంపి గ్రామంలో యంత్రంతో వరి నూర్పిళ్లు చేస్తున్న దృశ్యం

అరకులోయటౌన్: అన్నదాతల ముందున్న ఏకైక ప్రత్యామ్నాయ మార్గంగా యాంత్రీకరణ నిలుస్తోంది. వ్యవసాయంలో మానవ వనరులు రానురాను తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సాగులో ఆధునిక పరికరాల వినియోగంతో ప్రతికూల పరిస్థితులు, కూలీల కొరత అధిగమించడం సహా సమయం ఆదా అవ్వడం, పెట్టుబడి ఖర్చులు తగ్గుతుండడం వంటి అంశాలు వ్యవసాయ దారులకు ప్రధానం ఆకర్షిస్తున్నాయి. దీంతో గిరిరైతులు సైతం వ్యవసాయ యంత్ర పరికరాలు వాడేందుకు ఆశక్తి చూపిస్తుండడం విశేషం. వ్యవసాయ యాంత్రీకరణ వల్ల రైతులకు పనిభారం తగ్గుతుంది. సరైన యంత్ర పరికరాలు, ఉంటే విత్తులు నాటడం, నీరు పెట్టడం , కలుపు తీయడం, పంట కోయడం, వంటి పనులు సులభతరమవుతాయి. పెట్టుబడి శ్రమ తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశముంటుంది. చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాలు అందుబాటులో వచ్చాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు రాయితీపై యంత్రాలను అందించింది.

పెరుగుతున్న వినియోగం

ఒక్కప్పుడు పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన వ్యవసాయ యంత్రాలు.. ఇప్పుడు గిరిజన ప్రాంతంలోకి కూడా వచ్చేయడం గమనార్హం. వరి నూర్పిడి యంత్రం ఇపుడు నియోజకవర్గంలోని అన్ని మండల్లాలో వినియోగిస్తున్నారు. మైదాన ప్రాంతమైన వడ్డాది మాడుగుల ప్రాంతాలతో పాటు ఒడిశా నుంచి ఈ ప్రాంతానికి వరి నూర్పిడి యంత్రాలను అద్దెకు తీసుకువచ్చి గంటల వ్యవధిలో పెట్టుబడి తక్కువతో అతి సులభంగా వరి నూర్పిడి పనులు చేపడుతున్నారు. తక్కువ కాలంలో ధాన్యాన్ని అందించే ఈ యంత్రం గంటకు రూ. 2వేల అద్దెకు తీసుకుంటున్నారు. కూలీల కొరత నివారించేందుకు ఈ ప్రాంతంలోని పెద్ద పెద్ద రైతులు వినియోగిస్తున్నారు. ఈ యంత్రాలు గత మూడేళ్ల క్రితం నుంచి ఈ ప్రాంతంలో దర్శనమిస్తున్నాయి. పంట పొలాల్లో కోసిన పంటను అదే పొలంలో ఒకటి రెంటు రోజులు ఎండిన తరువాత యంత్రాలను తీసుకువెళ్లి నూర్పిడి చేస్తున్నారు. ఈ యంత్రం ద్వారా నూర్పిడి చేయడం ద్వారా కూలీల కొరత తగ్గడమే కాకుండా పెట్టుబడి చాలా తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. చిన్న చిన్న రైతులు మాత్రం ట్రాక్టర్‌లతో కల్లాల్లో వరి నూర్పిడి చేయించుకుంటున్నారు. వరి కుప్పను బట్టి బేరం కుదుర్చుకొని నూర్పిడి చేయించుకుంటున్నారు. ప్రతికూల వాతావరణంలో కూడ గాలి పట్టే ఫ్యాన్‌లు ట్రాక్టర్‌కు అమర్చి ధాన్యం, పొట్టు వేరు చేయించే పనులు చేపడుతున్నారు.

గత కొన్నేళ్లుగా దుక్కిటెడ్లుతో మెట్టు గరువులు, పొలాలు దుక్కి చేసే గిరిరైతులు ట్రాక్టర్, ఇతర యంత్ర సామాగ్రితో దుక్కి చేసి పంటలు పండిస్తున్నారు. ఏది ఏమైనా గతంలో పెట్టు బడి ఎక్కువతో కూలీల ద్వారా వరి పంట పండించుకునే గిరిరైతులు ప్రస్తుతం తక్కువ పెట్టుబడితో తక్కువ సమయంలోనే వరి పంట కోతలు, నూర్పిడిలు చేసుకుంటున్నారు.

పెట్టుబడి తగ్గింది



గతంలో వరి కోతలు, నూర్పిడికి అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సి వచ్చేది. ప్రస్తుతం వరి నూర్పిడి యంత్రాలు మన్యంలో కూడా అందుబాటులోకి రావడంతో గత మూడేళ్ల నుంచి వినియోగిస్తున్నాం. దీంతో తక్కువ పెట్టుబడితో తక్కువ సమయంలో ధాన్యం ఇంటికి తీసుకురాగలుగుతున్నాం. ఈ యంత్రాల వినియోగంతో 50 శాతం పెట్టుబడి తగ్గుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై ఇటువంటి యంత్రాలు అందిస్తే బాగుంటుంది.

– పాంగి రాంబాబు, గిరిరైతు, శిమిలిగుడ, అరకులోయ మండలం

అందుబాటులో యంత్రాలు



గిరిరైతులు వరి పంట సాగులో గత కొన్నేళ్లుగా యాంత్రీకరణపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉంది. కూలీ రేట్లు పెంచినప్పటికీ కూలీలు దొరకడం లేదు. యంత్రాలు అందుబాటులోకి వచ్చిన తరువాత పెట్టుబడి తగ్గడమే కాకుండా, సకాలంలో అనుకున్న సమయానికి పంటను ఇంటికి తెచ్చుకోగలుగుతున్నారు. వర్షాభావ పరిస్థితుల నుండి పంటను రక్షించుకుంటున్నారు.

– ఫణి రాజ్ వర్మ, వ్యవసాయ శాఖ ఏఓ, అరకులోయ

చిన్నారులకు ఆటల పోటీలు



చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహిస్తున్న గ్రంథాలయ శాఖ అధికారి సత్యవతి

పాడేరు : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో ఆదివారం పలు ఆటల పోటీలను నిర్వహించారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, లెమెన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని గ్రంథాలయశాఖ అధికారి సత్యవతి చెప్పారు. బీవీకే పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కేజీబీవీ, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల నుంచి సుమారు 100 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. చదువుతో పాటు డ్రాయింగ్‌లో కూడా విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి ఎస్.సునీత విద్యార్థినులకు సూచించారు. పోటీల్లో విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులు, గ్రంథాలయ ఓఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన



కింద్ర గ్రామంలో రైతులకు బీమా సదుపాయంపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారులు

రాజవొమ్మంగి: రైతులు తమ ఉద్యానవన పంటలు, పండ్ల తోటలను బీమా చేసుకోవాలని మండల ఉద్యానవనశాఖాధికారి కోలా ముత్తయ్య కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించి, పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. కింద్ర గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీమా ప్రీమియం చెల్లింపునకు ఈ నెల 22 వరకు గడువు ఉందన్నారు.మామిడి, జీడిమామిడి, కూరగాయ పంటలకు ఎకరాకు ఏడాదికి రూ.1,540 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అధికారులు వచ్చి పంట నష్టం అంచనా వేసిన అనంతరం తగిన పరిహారం అందించే అవశాముంటుందన్నారు. పంటల బీమాకు సంబంధించి మరిన్ని వివరాలకు 9493640520 నంబర్‌కు సంప్రదించాలని కోరారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ బూసరి సత్యనారాయణ, హార్టీకల్చర్ అసిస్టెంట్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబాకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో షిర్డీ సాయిబాబా

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయి బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మందిరంలో సాయిబాబా విగ్రహాన్ని రంగు రంగుల పూలతోను, మందిరాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమానికి స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

పాడేరు : కూటమి ప్రభుత్వం చేపడుతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని వ్యతిరేకించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ పూర్తి మద్దతు ఇస్తుందని జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15ఏళ్లుగా సుమారు 1700 మంది ఉద్యోగులు గురుకులాల్లో తక్కువ వేతనాలతో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. వీరి వేతనాల్లో కూడా తీవ్ర వ్యత్యాసం ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, మండల కార్యదర్శి సుందర్‌రావు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో పంటకు మేలు



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర కాలనీ అనే గ్రామంలో ఆదివారం విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్(టాటా ట్రస్ట్) శాస్త్రవేత్తలు జీవన ఎరువుల వినియోగంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక నిపుణులు డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రాజెక్టులో భాగంగా జీవన ఎరువులు (బయో ఇన్‌క్యూలెంట్స్) అనే అంశంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ట్రికో డెర్మా, సూడోమోనాస్ వల్ల ఉపయోగాలు, వాటి వాడకం వివరించారు. గిరిజన ఉప ప్రణాళికకు కింద రైతులకు బయోఇన్‌క్యూలెంట్స్‌ను రైతులకు ఉచితంగా అందజేశారు. నిపుణులు డాక్టర్ చలపతి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


వాహన తనిఖీలు



చవిటిదిబ్బలులో వాహనాల తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామ జంక్షన్‌లో ఆదివారంరాత్రి ఎస్‌ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఆ ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే వాహన రికార్డులు, డ్రైవింగు లైసెన్స్‌లు లేని వాహనాలపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానం.. క్రీడా మైదానం



ముంచంగిపుట్టులో హోలీ క్రీడా మైదానంలో పేరుకుపోయిన చెత్త

- మురుగునీటి నిల్వ, పేరుకుపోయిన చెత్త
- దుర్గంధంతో సతమతం
- వాకర్స్, క్రీడాకారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న హోలీ క్రీడా మైదానం అధ్వానంగా మారింది. మైదానం చుట్టూ చెత్తాచెదారం పెరుకుపోవడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. మండలంలోని 23 పంచాయతీల క్రీడాకారులకు పోటీలు నిర్వహించేందుకు ఈ హోలీ మైదానం ప్రధానం.

మైదానం చుట్టూ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలు రెండు ఉన్నాయి. ఆయా పాఠశాలల నుంచి చెత్తను క్రీడా మైదానంలోకి తరుచూ పడేస్తుండడంతో మైదానంలో పూర్తిగా పారిశుద్ధ్యం లోపించిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో పాటు బాలికల పాఠశాల -1 నుంచి మురుగునీరు మైదానంలోకి వచ్చేస్తూ ఉండడంతో ఎక్కడబడితే అక్కడ మురుగునీరు నిల్వ ఉండిపోతోందని, దీంతో తీవ్ర దుర్గందంతో ఉదయం పూట వ్యాయామం చేసేవారు, క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు మైదాన సైతం పాడైపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీ అధికారులు స్పందించి క్రీడా మైదానంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.ఈ విషయాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ వద్ద ప్రస్తావించగా క్రీడా మైదానంలో చెత్తను తొలగించే ఏర్పాట్లు చేస్తామని, మురగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రహదారిని అభివృద్ధి చేయాలి



పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మాణిక్యం, జెడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని ప్రముఖ సందర్శిత ప్రాంతమైన బొర్రా గుహల వద్ద పర్యాటకు వాహనాల పార్కింగ్ స్థలం వద్ద రహదారికి ఇరువైపులా ఉన్న గోతులను పూడ్చాలని జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. తహసీల్దార్ వి.మాణిక్యంతో కలిసి ఆయన ఆదివారం బొర్రా గుహల పరిసరాలను సందర్శించారు. ఈ మేరకు వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ ఈ రహదారికి మరమ్మతు చేసి స్థానికులతోపాటు పర్యాటకుల కష్టాలు తీర్చాలన్నారు. టోల్‌గేట్‌కు ఆనుకొని ఉన్న 1.30 సెంట్లు భూమి చదును చేయాలని ఆదేశాలు ఉందని, టోల్ గేట్‌లో డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి రహదారి అభివృద్ధి చేయాలన్నారు. పార్కింగ్ స్థలం ఎదురుగా మరగుదొడ్లు నిర్మించాలని పర్యాటకులు డిమాండ్ చేస్తున్నప్పటికీ పర్యాటక శాఖ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. బొర్రా గుహల వద్ద పార్కింగ్‌తో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు విన్నవించామన్నారు. ఇక్కడి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో కుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. నాయకులు నవీన్, మురళీ, దేవన్న, రమేష్, సురేష్‌బాబు, అర్జున్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

ఎటపాక: మండలంలోని గుండాల కాలనీకి చెందిన ఇద్దరు రైతుల మధ్యన ఘర్షణ, దాడులు చేసుకునేంత వరకు దారి తీసింది. గ్రామానికి చెందిన సాయిలి బాబు తన ఇంజన్ పైపులు స్థానిక రైతు ములకల నాగరాజు వద్ద ఉన్నట్టు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన పైపులు ఇక్కడ ఎలా వచ్చాయని నాగరాజును అడగటంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో వారు దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో బాబుపై నాగరాజు గొడ్డలి విసరడంతో బాబు చెవికి తగిలి రక్తస్రావమైంది. ఫిర్యాదు మేరకు ఎటపాక ఎస్‌ఐ పార్థసారది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రమదానంతో రహదారి పనులు

- తాత్కాలిక పనులతో వాహనాల రాకపోకలు
- రోడ్డు నిర్మించాలని గ్రామస్తుల విన్నవం



రహదారి మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

డుంబ్రిగుడ: మండలంలోని అరకు నుంచి అంతర్రాష్ట్ర ఒడిశా రోడ్డులో కొర్రాయి వద్ద ఉన్న వంతెన ఎత్తు తక్కువ కావడంతో పాటు పొలాలు నుంచి వచ్చే వ్యవసాయ నీరు, వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో రోడ్డు పూర్తిగా పాడైపోయి గోతులమయంగా మారింది. దీంతో పాటు ప్రతి రోజు ఈ రహదారిలో భారీ వాహనాల రాకపోకలతో తరచూ ట్రాఫిక్‌కు సమస్య వెంటాడుతోందని గిరిజనులు చెబుతున్నారు. ఈ రహదారిలో ఉన్న ఎకో టూరిజం కొల్లాపుట్టు ఐటీడీఏ కాటేజీలు ఉండడంతో అక్కడికి వచ్చే పర్యాటక వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఏకో టూరిజం సిబ్బంది ఆదివారం శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు చేశారు. కనీసం కారు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేలా ఏర్పాటు చేస్తున్నట్టు వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ అంతర్ రాష్ట్ర రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కృష్ణకుమారికి ఉపాధ్యాయ స్ఫూర్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న టీచర్ కృష్ణకుమారి

డుంబ్రిగుడ: మండలంలోని కేజీబీవీలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న కమ్మిడి కృష్ణకుమారికి ఉపాధాయ స్ఫూర్తి అవార్డును హైదరాబాదులో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఫోన్‌లో విలేకరులతో మాట్లాడుతూ విద్యా సంబంధమైన ఉపాధ్యాయ స్ఫూర్తి అవార్డుకు తాను ఎంపిక కావడం ఎంతో షంతోషంగా ఉందన్నారు. గిరిజన ప్రాంతంలో చేస్తున్న సేవలకు గాను తనకు ఇటీవల ఢిల్లీలో అవార్డు అందినట్టు ఆమె గుర్తు చేశారు. అవార్డులు రావడంపై ఆమె ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.భవానీతో పాటు సహచర ఉపాధ్యాయులు, సిబ్బందితో పలువురు అభినందనలు తెలిపారు.